క్లుప్తంగా

హైమాస్ట్ లైట్లకు ఆన్‌ఆఫ్ లేదు..



శాయంపేట : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లకు ఆన్‌ఆఫ్ పనిచేయక పోవడంతో నిత్యం వెలుగుతున్నాయి. అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు హైమాస్ట్ లైట్లకు టైమర్ ఏర్పాటు చేసి విద్యుత్‌ను ఆదా చేయాలని స్థానికులు కోరుతున్నారు.

బీసీ-డీగా నమోదు చేసుకోవాలి

నడికూడ : నేటి నుంచి ప్రభుత్వం చేపట్టే సమగ్ర ఇంటింటి సర్వేలో భాగంగా బీసీ కుల గణన చేపడుతున్న సందర్భంగా ఆరే కులస్తులు ఇంటిపేరులో ఆరే అని నమోదు చేసుకోవాలని ఆ సంఘం మండల అధ్యక్షుడు నాగేశ్ తెలిపారు. సర్వేలో ఆరేగా రాయించి బీసీ-డీగా నమోదు చేసుకోవాలని కోరారు.

నేడు నీటి సరఫరా బంద్

వరంగల్ అర్బన్ : వరంగల్ పరిధి చార్‌బౌళి వాటర్ ట్యాంక్ వాల్వ్ దెబ్బ తినడంతో మరమ్మతు పనులు కొనసాగుతున్నాయని, ఈ కారణంగా బుధవారం వాటర్ ట్యాంక్ పరిధిలో నీటి సరఫరా బంద్ ఉంటుందని బల్దియా ఈఈ రామోజు శ్రీనివాస్ తెలిపారు. ట్యాంక్ పరిధిలోని గిర్మాజిపేట, మండిబజార్, నిజాంపుర, రా ధికా టాకీస్ గల్లీ, లక్ష్మీపురం, పాత,కొత్త చార్ బౌళి ప్రాంతాల్లో నీటి సరఫరా ఉండదని, ప్రజలు సహకరించాలని కోరారు.

నేడు విద్యుత్ అంతరాయం

హన్మకొండ : హనుమకొండలోని పలు ప్రాంతాల్లో బుధవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబారెడ్డి తెలిపారు. కేయూ క్రాస్ రోడ్డు, హరిహర అపార్ట్‌మెంట్స్, శంకర్‌నగర్, భారతీ విద్యాభవన్, మైనార్టీ కాలేజీ ప్రాంతంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, శంకర్‌నగర్, ఆదర్శనగర్, సమ్మయ్యనగర్, కుడా కాలనీ ప్రాంతంలో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు, బాలసముద్రం స్విమ్మింగ్ పూల్, ఎల్‌బీసీ కార్యాలయం, నక్కలగుట్ట మెయిన్‌రోడ్డు, రమేష్ స్కిన్ డాక్టర్, అంబేద్కర్ కూడలి ప్రాంతంలో ఉదయం 9 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ల జారీ

కాజీపేట: మండలంలోని తరాలపల్లి, రాంపేట గ్రామాల్లో మంగళవారం 120 మంది పెన్షనర్లకు డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్లు జారీ చేశారు. రిటైర్డ్ పెన్షనర్స్ అసోసియేషన్ కాజీపేట బ్రాంచ్ కమిటీ అధ్యక్షుడు కె.సంగమయ్య సర్టిఫికెట్ల నమోదును ప్రారంభించారు. కార్యక్రమంలో డివిజనల్ అధ్యక్ష, కార్యదర్శులు జీఎస్.బాబురావు, పి.వెంకటేశ్వర్లు, మారపాక కట్టస్వామి, కేవీ రావు, సాధినేని సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బీమా సొమ్ము అందజేత

మామునూరు : ఖిలావరంగల్ మండలం తిమ్మాపురం గ్రామంలో జనచైతన్య పురుషుల పొదుపు సంఘ సభ్యుడు బండి కొమురయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మంగళవారం మృతుడి నామినికి సంఘం ప్రతినిధులు రూ.2.70లక్షల బీమా సొమ్మును అందజేశారు. ప్రతాపరుద్ర పొదుపు సమితి అధ్యక్షుడు మండల సుదర్శన్‌రెడ్డి, సంఘం అధ్యక్షుడు మాచర్ల రంజిత్‌కుమార్, డైరెక్టర్లు, గణకుడు కల్లెపు రాము పాల్గొన్నారు

యువతికి ఆర్థిక సాయం

వరంగల్ చౌరస్తా : వరంగల్ పట్టణ ఆర్యవైశ్య సంఘం సేవా దృక్పథంతో కల్యాణమస్తు పథకం ద్వారా ఓ నిరుపేద యువతి అయిన తోట చందనకు ఆర్థికసాయం అందజేశారు. మంగళవారం వరంగల్ ఆర్ఎస్‌టీరోడ్డులోని వైశ్య భవన్‌లో అధ్యక్షుడు గుండా ప్రకాశ్‌రావు తోట లక్ష్మి, రాజు దంపతుల కుమార్తె చందన వివాహానికి మంగళ సూత్రాలు, మిట్టెలు, రూ.2,516 నగదు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అజయ్ కుమార్, మౌనిక, మంజుల, రమ, రమాదేవి, లావణ్య పాల్గొన్నారు.

కోర్టుకు హాజరైన మాజీ ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్

హన్మకొండ : అసెంబ్లీ సాధారణ ఎన్నికల సందర్భంగా నమోదైన కేసులో మాజీ ప్రభుత్వ చీఫ్ విప్, బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ కోర్టుకు హాజరయ్యారు. మంగళవారం హైదరాబాద్‌లోని సిటీ సివిల్ కోర్టులో స్పెషల్ పొలిటికల్ కేసుల విచారణ జరిగింది. ఈ విచారణకు వినయ్‌భాస్కర్‌తో పాటు బీఆర్ఎస్ వరంగల్ పశ్చిమ కన్వీనర్ తాళ్లపెల్లి జనార్ధన్‌గౌడ్ హాజరయ్యారు.

అప్రమత్తంగా ఉండాలి

వరంగల్ చౌరస్తా : ఆర్థిక మోసాలను అరికట్టేందుకు వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌బీఐ హైదరాబాద్ సర్కిల్ చీఫ్ మేనేజర్ రాజేష్ అన్నారు. వరంగల్ ఫోర్ట్ రోడ్డు, కాకతీయ విశ్వ విద్యాలయా శాఖల పునరుద్ధరణ సేవలను ప్రారంభించి మాట్లాడారు.

వేధిస్తున్న అదనపు గదుల కొరత

- అధ్వానంగా ప్రాథమిక పాఠశాల పరిస్థితి
- విద్యార్థులకు తప్పని ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు



మండల కేంద్రంలో అరకొర గదులతో ఉన్న ప్రాథమిక పాఠశాల

ఆత్మకూరు : మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలకు తరగతి గదుల కొరత వేధిస్తోంది. దీంతో విద్యార్థిని, విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. సరిపడా గదులు లేకపోవడంతో పాఠశాల ఆవరణలోనే పాఠాలు వినాల్సిన పరిస్థితి నెలకొంది. విద్యార్థులు, ఉపాధ్యాయులు సరిపడా ఉన్నప్పటికీ పాఠశాలలో వసతులు మాత్రం అరకొరగా ఉడడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు విద్యార్థులు వాపోతున్నారు. గొల్లవాడ ప్రాథమిక పాఠశాల రెండు గదుల్లోనే పాఠాలు బోధిస్తూ నెట్టుకొస్తున్నారు. జిల్లా విద్యాశాఖ అధికారులకు, పాలకులకు పలుమార్లు విన్నవించినా ఫలితం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు అంటున్నారు. పాఠశాలలో ఒకటో తరగతి నుంచి 5వ తరగతి వరకు పాఠశాల కొనసాగుతుండగా 100కు పైగా విద్యార్థులు అందులో ఉన్నారు. అలాగే మధ్యాహ్న భోజనం చేసేందుకు కూడా సౌకర్యం లేకపోవడంతో చెట్టు కిందనే భోజనం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రాథమిక పాఠశాలకు అదనపు తరగతి గదులు మంజూరు చేయాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, స్థానికులు కోరుతున్నారు. విద్యారంగానికి ప్రభుత్వం పెద్దపీట వేయాలని, స్థానికంగా ఉన్న ప్రజాప్రతినిధులు ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేలా కృషి చేయాలని కోరారు.

ఉన్నతాధికారులకు తెలిపాను..



పాఠశాలలో రెండు గదులే ఉండడం వలన తరగతుల నిర్వహణ ఇబ్బందిగా మారింది. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు, ప్రజాప్రతినిధులకు తెలిపాను. అదనపు గదులు నిర్మిస్తే విద్యార్థులకు సౌకర్యంగా ఉంటుందని వివరించాను. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నడుచుకుంటాం. ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు వస్తే తదుపరి చర్యలు చేపడుతాం.

\- పెండెం రాజు, హెచ్ఎం

చదువుతోనే బంగారు భవిష్యత్



పరీక్షప్యాడ్లు పంపిణీ చేస్తున్న జగదీశ్వర్

కమలాపూర్ : చదువుతోనే మంచి భవిష్యత్ ఉంటుందని గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ నిర్వాహకుడు గంగిశెట్టి జగదీశ్వర్ (రిటైర్డ్ టీచర్) అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు హుజూరాబాద్‌కు చెదిన గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం పరీక్షప్యాడ్లు పంపిణీ చేశారు. ఎంజేపీ బాలుర గురుకుల పాఠశాలలో 115 మందికి, బాలికల గురుకుల పాఠశాలలో 77 మందికి, కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో 45 మంది పదోతరగతి విద్యార్థులకు, కేజీబీవీ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు 57 మంది చొప్పున మొత్తం 294 మంది విద్యార్థులకు పరీక్షప్యాడ్లను ఆయన పంపిణీ చేశారు. ఆయా విద్యాసంస్థల ప్రిన్సిపాల్స్ రవీందర్, సౌజన్య, కేజీబీవీ ఎస్ఓ అర్చన, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధి పనులను వినియోగించుకోవాలి



గ్రామ సభలో మాట్లాడుతున్న ఏపీఓ శారద

దామెర : ఉపాధి హామీ పనులను అర్హులైన కూలీలు వినియోగించుకోవాలని ఏపీఓ శారద సూచించారు. మండలంలోని పసరగొండలో ఉపాధి హామీ పనులపై గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా 2025-26 సంవత్సరానికి గ్రామంలో చేపట్టే పనుల వివరాలు చదివి వినిపించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. గ్రామ సభలో గుర్తించిన పనులను ఉపాధి హామీ పథకం ద్వారా చేపడతామని అన్నారు. పనుల్లో ఎలాంటి అవకతవకలు జరగకుండా చూడాలని ఈజీఎస్ సిబ్బందిని ఆదేశించారు. ఈ సమావేశంలో పంచాయతీ కార్యదర్శి వేణుగోపాల్, టెక్నికల్ అసిస్టెంట్ సురేందర్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నాగులచవితి వేడుకలు



శాయంపేట : తహరాపూర్‌లోని పుట్ట వద్ద పూజలు చేస్తున్న భక్తులు



కమలాపూర్‌లో..

శాయంపేట : మండల వ్యాప్తంగా మంగళవారం నాగుల చవితి వేడుకలను మహిళలు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. పలు ఆలయాల్లోని పుట్టలో పాలుపోసి ప్రత్యేక పూజలు చేశారు. తహరాపూర్ గ్రామంలోని శివనాగాంజనేయస్వామి ఆలయంలో పుట్టను తీరొక్క పూలతో అలంకరించారు. మండల కేంద్రంలోని శివ మార్కండేయ వేంకటేశ్వర ఆలయ సముదాయాల్లో, మత్స్యగిరిస్వామి ఆలయ ఆవరణలోని నాగేంద్రస్వామి ఆలయంలో గల పుట్టలో పాలుపోసి మహిళలు భక్తిశ్రద్ధలను చాటుకున్నారు. ఆలయ అర్చకులు మార్త రాజ్‌కుమార్, ఆరుట్ల కృష్ణమాచార్యులు ప్రత్యేక పూజలు జరిపించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్‌లు బాసాని సూర్యప్రకాశ్, సామల భిక్షపతి పాల్గొన్నారు.

కమలాపూర్‌లో..

కమలాపూర్ : మండలంలోని అన్ని గ్రామాల్లో మంగళవారం నాగుల చవితి వేడుకలు ఘనంగా జరిగాయి. ఉప్పల్‌లోని శివాలయం, రామాలయం, వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో నాగ ప్రతిమలకు, సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో సుబ్రహ్మణ్యస్వామితో పాటు ఆలయాల్లోని పుట్టల్లో పాలు పోసి మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు కృష్ణమాచార్యులు, లక్ష్మణాచార్యులు, హరీషాచార్యులు, గోవర్ధనగిరి నర్సయ్యశర్మ, భక్తులు పాల్గొన్నారు.

పోరాటంతోనే పెన్షనర్లకు న్యాయం

- ఎస్టీఓ కార్యాలయం ఎదుట ధర్నా



వినతిపత్రం అందజేస్తున్న పెన్షనర్లు

ఎల్కతుర్తి : పోరాటంతోనే పెన్షనర్లకు న్యాయం లభిస్తుందని ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోషయేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నారాయణగిరి వీరన్న అన్నారు. పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ భీమదేవరపల్లి మండల కేంద్రంలోని ఎస్టీఓ కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వీరన్న మాట్లాడుతూ.. సమస్యల పరిష్కారం కోసం దశలవారిగా పోరాట కార్యక్రమానికి రాష్ట్ర సంఘం పిలుపునిచ్చిందని అన్నారు. అందులో భాగంగా మొదటి దశగా అన్ని ఎస్టీఓ కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహించినట్లు తెలిపారు. రెండోదశలో జిల్లా కలెక్టర్ కార్యాలయాల ఎదుట నిరసన కార్యక్రమాలు చేపట్టి వినతిపత్రాలు అందజేయనున్నట్లు వెల్లడించారు. బకాయిలు ఉన్న డీఆర్‌లను వెంటనే విడుదల చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ప్రభుత్వ ఉద్యోగుల పెన్షన్‌తో పాటు వివిధ సమస్యలనుడిమాండ్ చేశారు.

పునఃప్రతిష్ఠాపనకు శివాలయం సిద్ధం



విద్యుత్ కాంతుల్లో శివాలయం

ఆత్మకూరు : మండల కేంద్రంలో రాతితో నిర్మించిన పంచకూట శివాలయం పునః ప్రతిష్ఠాపనకు సిద్ధమైంది. భక్తుల రాకకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. బుధవారం ఉదయం గణపతి ప్రార్థన గోపూజ అఖండ దీపారాధన నీరాజనం మంత్రపుష్పాలు జలాదివాస సహిత క్షీరాధివాస కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు అర్చకులు రవీందర్ శర్మ, శ్రావణ్ శర్మ తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండలం హవెల్దార్‌పల్లి గ్రామ శివారులో నలుగురు వ్యక్తులు పేకాడుతుండగా పట్టుకున్నట్లు ఎస్సై సాయిబాబు తెలిపారు. ఎర్రబెల్లి గ్రామానికి చెందిన కన్నయ్య, ముత్తారం గ్రామానికి చెందిన ఎల్దీ మోహన్, నధునూరి కరుణాకర్, వడ్డెపల్లి శ్రీనివాస్‌ను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. వారి నుంచి పేకముక్కలతో పాటు మూడు సెల్ ఫోన్లు, రూ.9,400 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

టీపీటీఎఫ్ మండల అధ్యక్షుడిగా రాజు



ఉజ్జేతుల రాజు



లకుం భాస్కర్

కమలాపూర్ : తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) కమలాపూర్ మండల అధ్యక్షుడిగా ఉజ్జేతుల రాజు ఏకగ్రీవంగా ఎన్నికైన నట్లు ఎన్నికల అధికారి, టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ముత్యాల రఘుపతి, ఎన్నికల పరిశీలకుడు, జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రగిరి లక్ష్మయ్య తెలిపారు. మండలంలోని గూడూరు ప్రాథమిక పాఠశాలలో మంగళవారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆ సంఘం మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ప్రధాన కార్యదర్శిగా లకుం భాస్కర్, ఉపాధ్యక్షులుగా లునావత్ మురళీమోహన్, ప్రభావతి, శ్రీరాములు, కార్యదర్శులుగా గుమ్మడి ప్రసాద్, స్వప్న, కాశీరాం, జిల్లా కౌన్సిలర్లుగా భిక్షపతి, చంద్రమౌళి, వెంకటేశ్వర్లు, ఎన్నికైనట్లు తెలిపారు.

ఉచిత వైద్యశిబిరం



ఐనవోలు : మండలంలోని కక్కిరాలపల్లి ప్రభుత్వ పాఠశాలలో ఓపెన్ డోర్ చర్చ్ కక్కిరాలపల్లి ఆధ్వర్యంలో హ్యాండ్ ఆఫ్ హోప్ హైదరాబాద్ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. సుమారు 350 మందికి వివిధ వైద్యపరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కక్కిరాలపల్లి గ్రామానికి చెందిన జిల్లా నరేష్ ఇటీవల ఎంబీబీఎస్ పూర్తిచేసి వైద్యశిబిరంలో పాల్గొనగా గ్రామస్తులు ఆయనను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు రేవ, తిమాతి, జయరాజ్, హెచ్ఎం రామకృష్ణ, మాజీ ఎంపీటీసీ రమేశ్, పాస్టర్ భాస్కర్, ఏలియా, మధుకర్, సురేష్, వేణు, డేవిడ్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

కమలాపూర్ : మండల కేంద్రంలోని అంబేడ్కర్ నగర్‌లో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన మాట్ల సమ్మక్క కుటుంబాన్ని తెలంగాణ రాజ్యాధికార ఐక్య సమితి మండల అధ్యక్షుడు పుల్ల శ్రీనివాస్ పరామర్శించారు. అనంతరం బాధిత కుటుంబానికి రూ.5వేలు ఆర్థికసాయంగా అందించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామన్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

శాయంపేట : హైదరాబాద్‌లోని భాగ్ లింగంపల్లి సుందరయ్య భవన్‌లో ఈనెల 7న జరిగే 'ప్రస్తుత రాజకీయాలు కార్పొరేట్ శక్తుల ప్రమాదం' అనే అంశంపై వామపక్ష కమ్యూనిస్టుల కర్తవ్యం జాతీయ సెమినార్‌కు సంబంధించిన వాల్ పోస్టర్లను మంగళవారం మండలంలోని వసంతాపూర్‌లో ఎంసీపీఐ (యూ) మండల కార్యదర్శి ఉస్మాన్ ఆవిష్కరించారు. ఈ జాతీయ సెమినార్‌కు కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. మహిళా నాయకురాలు ఎండి అశ్రఫ్, మోగిడే రవీందర్, కిషన్, నర్సయ్య, రాజిరెడ్డి, సర్దార్, భుజంగరావు, సురేష్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలి

- సీఐ రంజిత్‌రావు



మాట్లాడుతున్న సీఐ రంజిత్‌రావు

దామెర : యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని పరకాల రూరల్ సీఐ రంజిత్‌రావు అన్నారు. మండలంలోని పులుకుర్తిలో పోలీస్ కళాబృందం కళాజాత నిర్వహించారు. ఈ సందర్భంగా సమాజిక రుగ్మతలు, శాంతి భద్రతలు, ఆత్మహత్యలు వంటి అంశాలపై కళాకారులు పాడిన పాటలు పలువురిని ఆకట్టుకున్నాయి. అనంతరం సీఐ మాట్లాడుతూ.. యువత గంజాయి, గుట్కా, అంబార్, మద్యం వంటి మత్తుపదార్థాలకు బానిస కావొద్దన్నారు. అనవసరమైన గొడవల్లో తలదూర్చి కేసుల పాలవ్వొద్దన్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని సూచించారు. అపరిచిత వ్యక్తులకు ఏటీఎం పిన్ నంబర్, ఓటీపీ నంబర్లు షేర్ చేయొద్దన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని, యువకులు ర్యాష్ డ్రైవింగ్ చేయకూడదని అన్నారు. ఎస్సై కొంక అశోక్, కళా బృందం ఇన్‌చార్జ్ నాగమణి, సభ్యులు విలియమ్స్, వెంకటేశ్వర్లు, రత్నం, శ్రీనివాస్, నారాయణ, విక్రమ్‌రాజ్, చిరంజీవి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న శ్రీపాల్‌రెడ్డి

ఐనవోలు / కమలాపూర్ / ఆత్మకూరు/ దామెర : ఉపాధ్యాయుల సమస్యను పరిష్కరించేందుకు కృషిచేస్తానని పీఆర్టీయూ (టీఎస్) రాష్ట్ర సంఘం అధ్యక్షుడు, ఎమ్మెల్సీ అభ్యర్థి పింగిలి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఐనవోలు మండల కేంద్రంలోని ప్రఖ్యాత ఐనవోలు మల్లికార్జునస్వామిని ఆయన దర్శించుకున్నారు. అనంతరం ఐనవోలు, పున్నేలు, కక్కిరాలపల్లి, పంథిని, సింగారం, మరియపురం, కొండపర్తి జెడ్పీహెచ్ఎస్ ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీవీలోని ఉపాధ్యాయులను కలిశారు. రానున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఉపాధ్యాయులను అభ్యర్థించారు. ఎంఈఓ పులి ఆనందం, కాంప్లెక్స్ హెచ్ఎం ఆవుల వెంకటేశ్వర్లు, రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్లు తిరునగరి సూరిబాబు, శ్రీనివాస్, అశోక్‌రావు, మధుసూదన్ రెడ్డి, కొమురన్న, సమ్మన్న, మహిపాల్‌రెడ్డి, కిషన్, యాకయ్య, రాజు, చంద్రమోహన్ ఉన్నారు. అదే విధంగా కమలాపూర్‌లో మాజీ ఎమ్మెల్సీ భట్టారపు మోహన్‌రెడ్డి ఓటరు నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. మండల కేంద్రంలోని వివిధ పాఠశాలల్లో ఉపాధ్యాయులతో మాట్లాడారు. అలాగే ఆత్మకూరు మండల కేంద్రంలోని హైస్కూల్‌లో మండల అధ్యక్షుడు బుచ్చిరెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు నిర్మలకుమారి అధ్యక్షతన ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమం చేపట్టారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా శ్రీపాల్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దామెదర్‌రెడ్డి కోరారు. అలాగే దామెర మండలంలోని కోగిల్వాయి, పులుకుర్తి, ఊరుగొండలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుల్గం దామోదర్ రెడ్డి పర్యటించి ఓటరు నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. దామెరలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు శరత్‌కుమార్, ప్రధానకార్యదర్శి భగవాన్ రెడ్డి, మాజీ అధ్యక్షుడు రాజిరెడ్డి పాల్గొన్నారు.

నిరుపేదలకు అండగా రాష్ట్ర ప్రభుత్వం



మాట్లాడుతున్న రామకృష్ణ

దామెర : నిరుపేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలుస్తోందని ఆ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి దుర్శెట్టి భిక్షపతి అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ముఖ్యకార్యకర్తల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. బుధవారం నుంచి చేపట్టనున్న కుల జనగణనకు ప్రజలు సహకరించాలని కోరారు. సీనియర్ నాయకులు పోశాలు, కట్టయ్య, ప్రవీణ్, రవి, రమేశ్, రతన్‌కుమార్, శ్రీనివాస్, ప్రసాద్, రాజు, కొమురయ్య, కృష్ణ, హరీష్, లింగయ్య, వినీల్, కార్యకర్తలు పాల్గొన్నారు.

పరకాల : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని కాంగ్రెస్ జిల్లా నాయకుడు సోదా రామకృష్ణ పిలుపునిచ్చారు. పట్టణంలోని 6,7,20 వార్డు ప్రజలతో ఆయన మాట్లాడారు. ప్రజలందరికీ సమాన హక్కులు కల్పించేందుకు సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే చేపట్టినట్లు చెప్పారు. 20వ వార్డు అధ్యక్షుడు బొచ్చు శ్రీను, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగిఉండాలి



అవగాహన కల్పిస్తున్న సఖి సంస్థ ప్రతినిధులు

దామెర : మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని మెడికల్ ఆఫీసర్ శాంతిప్రియ అన్నారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో సర్వోదయ యూత్, మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలు గృహహింస, లైంగిక వేధింపులు, అత్యాచారాలు వంటి వేధింపుల పరిష్కారానికి సఖి సెంటర్‌ను సంప్రదించాలని సూచించారు. వైద్యసాయం, పోలీస్ సాయం, తాత్కాలిక వసతి, న్యాయ సాయం, కౌన్సెలింగ్ వంటి సేవలను సఖి సంస్థ అందిస్తున్నట్లు తెలిపారు. కేస్ వర్కర్ వినీల, కరుణ, పీహెచ్‌సీ సిబ్బంది అశోక్‌బాబు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

రీ స్క్రీనింగ్ టెస్టులు చేయాలి



వివరాలు తెలుసుకుంటున్న ఇక్తార్ అహ్మద్

శాయంపేట : 30 ఏళ్ల పైబడిన ప్రతి ఒక్కరికీ బీపీ, షుగర్, క్యాన్సర్ రీ స్క్రీనింగ్ టెస్టులు చేయాలని ఎన్సీడీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఇక్తార్ అహ్మద్ ఆశా కార్యకర్తలను సూచించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో మంగళవారం డాక్టర్ సాయికృష్ణ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 2018 సంవత్సరంలో ఎన్సీడీ (నాన్ కమ్యూనికేబుల్ డిసీజెస్) స్క్రీనింగ్ టెస్టులు చేశామని అన్నారు. ప్రస్తుతం 30 ఏళ్లు పైబడిన ప్రతిఒక్కరికీ రీ స్క్రీనింగ్ టెస్టులు బీపీ, షుగర్, క్యాన్సర్ టెస్టులు నిర్వహించాలని షెడ్యూల్ విడుదల చేశారు. బీపీ షుగర్ ఉన్న వారు టాబ్లెట్ల కోసం వచ్చినప్పుడు పరీక్షలు చేయాలన్నారు. హెచ్ఈఓ వెంకటేశ్వరవర్మ, పీహెచ్ఎన్ విజయ, హెల్త్ సూపర్‌వైజర్లు, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మెస్ చార్జీల పెంపుపై హర్షం

ఎల్కతుర్తి : రాష్ట్రంలోని ప్రభుత్వ గురుకులాలతో పాటు ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థిని, విద్యార్థులకు ప్రభుత్వం మెస్ చార్జీలు, వ్యక్తిగత చార్జీలు పెంచడంపై కాంగ్రెస్ మండల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు మండల కేంద్రంలో మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం మండల కేంద్రంలోని గురుకుల పాఠశాలలతో పాటు ఆదర్శ పాఠశాల, జెడ్పీహెచ్ఎస్‌లోని విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. విద్యార్థులకు మెస్, వ్యక్తిగత చార్జీల విషయంలో గత ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేద విద్యార్థుల సంక్షేమంపై దృష్టి సారించినట్లు చెప్పారు. విద్యార్థుల ముఖాల్లో చిరునవ్వు కనిపిస్తోందన్నారు. ప్రభుత్వం కల్పించే వసతులను వినియోగించుకుని చదువుపై దృష్టి సారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఇంద్రసేనారెడ్డి, పీసీసీ సభ్యుడు బొమ్మనపల్లి అశోక్‌రెడ్డి, సుకినె సంతాజీ, ముప్పు మహేందర్, గొర్రె మహేందర్, శనిగరం వెంకటేష్, శీలం అనిల్ కుమార్, హింగె శ్రీకాంత్, సాహూ పాల్గొన్నారు.